మేడ్చల్‌లో హైడ్రా అధికారుల పర్యటన

మేడ్చల్: జాతీయ రహదారిపై తరచూ వరద నీరు రావడానికి కారణమైన ఓ వెంచర్ వద్ద మున్సిపల్ అధికారులతో కలిసి హైడ్రా అధికారులు పర్యటించారు. ఓ వెంచర్ వరదనీరు వెళ్లకుండా నాలాపై అక్రమంగా ప్రహరీ నిర్మించారని, మున్సిపల్ అధికారులు రెండ్రోజుల క్రితం నివారణ చర్యలు చేపట్టారు. అదే సమయంలో హైడ్రా కమిషనర్ రంగనాథ్ మార్గం మధ్యలో వెళ్తూ.. పరిస్థితిని సమీక్షించి వెళ్లారు. మంగళవారం హైడ్రా అధికారుల బృందం ఏజీఎస్ వెంచర్ నిర్మించిన ప్రహరీ, నాలాను పరిశీలించారు.

వినాయక మండపాలకు దరఖాస్తు చేసుకోవాలి

కీసర: మండల పరిధిలో ఏర్పాటు చేసే వినాయక మండపాల ఏర్పాటుకు నిర్వాహకులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని కీసర ఇన్‌స్పెక్టర్ ఆంజనేయులు ఓ ప్రకటన ద్వారా తెలియజేశారు. దీనికి సంబంధించిన వెబ్‌సైట్‌లో వివరాలు నమోదు చేసుకోవాలని సూచించారు.

ప్రతి వ్యక్తి మానవతా దృక్పథాన్ని కలిగి ఉండాలి



జవహర్‌నగర్‌లో మొక్కలు నాటుతున్న మేనేజర్ నగేష్‌బాబు తదితరులు

జవహర్‌నగర్: ప్రపంచ మానవతా దినోత్సవాన్ని పురస్కరించుకొని బాల్ రక్ష భారత్ ఆర్గనైజేషన్ సభ్యుడు రాజుయాదవ్ ఆధ్వర్యంలో సేల్స్‌ఫోర్స్ సహకారంతో మంగళవారం ఎన్‌టీఆర్‌నగర్‌లో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జవహర్‌నగర్ కార్పొరేషన్ మేనేజర్ నగేష్‌బాబు హాజరై ర్యాలీని ప్రారంభించి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మానవతా దృక్పథం ప్రతి వ్యక్తిలో ఉండాలన్నారు. అవసరమైన సమయంలో ఒకరికొకరు తోడ్పడటమే నిజమైన మానవత అని అన్నారు. మానవత విలువలపై ప్రజల్లో చైతన్య కల్పిస్తున్న బాల్ రక్ష భారత్ ఆర్గనైజేషన్ సేవలు అభినందనీయమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ లక్ష్మి, బాల్ రక్ష భార్ తెలంగాణ మేనేజర్ రంగనాథన్, రజనీకాంత్, ఆశావర్కర్లు, మహిళలు పాల్గొన్నారు.

కీసరలో కల్యాణ మహోత్సవం



కీసర: శ్రావణమాసం ఏకాదశిని పురస్కరించుకుని కీసరగుట్ట భవానీ శివదుర్గ సమేత రామలింగేశ్వరస్వామివారి కల్యాణోత్సవం కనుల పండువగా జరిగింది. మంగళవారం ఉదయం గర్భాలయంలో స్వామివారికి మహన్యాస రుద్రాభిషేకం, అనంతరం మహామండపంలో స్వామివారి కల్యాణానికి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం సత్యనారాయణస్వామి వ్రతాన్ని నిర్వహించారు. ఆలయ చైర్మన్ తటాకం నారాయణ, ఈఓ సుధాకర్‌రెడ్డి, సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

నిమజ్జనఘాట్‌లో ఏర్పాట్ల పరిశీలన

మల్కాజిగిరి: సఫిల్‌గూడ నిమజ్జనఘాట్‌ను మల్కాజిగిరి కార్పొరేటర్ శ్రవణ్, ఇంజినీరింగ్ విభాగం అధికారులు పరిశీలించారు. ఈ సందర్భంగా మంగళవారం కార్పొరేటర్ మాట్లాడుతూ.. మరో 10 రోజుల్లో నిమజ్జనం ప్రారంభమవుతుందని, ఇప్పటికీ నిమజ్జనం చేసే బేబీపాండ్‌ను శుభ్రం చేయలేదన్నారు. బేబీ పాండ్ ఎత్తు పెంచాలని చెప్పామని చుట్టూ.. సుందరీకరణ పనులు (పెయింటింగ్) కూడా పెండింగ్‌లో ఉన్నాయన్నారు. గుర్రపుడెక్క తొలగింపు పనులు నత్తనడకన సాగుతున్నాయని, త్వరితగతిన తొలగించాలని సూచించామన్నారు. రాంకీ వాహనాలను అదనంగా ఏర్పాటు చేయాలని జెడ్సీని కోరామన్నారు. నిమజ్జనఘాట్ నోడల్ అధికారైన డీఈ మహేష్ పూర్తిగా విఫలమయ్యారని, ఆయనను విధుల నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. నిమజ్జన ఘాట్‌కు దగ్గరలోనే ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌కు పెన్సింగ్ వేయాలని ఏడీఈ చంద్రశేఖర్‌ను కోరామన్నారు.

కాప్రా: గణేష్ ఉత్సవాలు సమీపిస్తున్న నేపథ్యంలో కాప్రా చెరువు వద్ద నిమజ్జన ఏర్పాట్లు మంగళవారం అధికారులు పర్యవేక్షించారు. నిమజ్జన సమయంలో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు తగిన చర్యలు చేపడుతున్నారు. చెరువులో పెద్ద విగ్రహాలు, పక్కనే కొలనులో చిన్న,చిన్న గణనాథులను నిమజ్జనం చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ నేపథ్యంలోనే కుషాయిగూడ ఇన్‌స్పెక్టర్ భాస్కర్‌రెడ్డితో పాటు ఇతర పోలీసు అధికారులు, జీహెచ్ఎంసీ అధికారులు పాల్గొన్నారు.

జలకళ

నిండిన చెరువులు.. | పారుతున్న అలుగులు



మత్తడి నీరు నుంచి పారుతున్న రావల్‌కోల్ చెరువు



మేడ్చల్: వారం రోజులుగా మేడ్చల్, ఎల్లంపేట్ మున్సిపాలిటీలలో కురుస్తున్న భారీ వర్షాలతో రెండు మున్సిపాలిటీల్లోని అన్ని చెరువులకు జలకళ సంతరించుకుంది. భారీ వర్షాలు కురవడంతో వరద నీరు వాగుల ద్వారా అధికంగా వచ్చి చెరువులు, కుంటలలో చేరడంతో చెరువులు పొంగిపొర్లుతున్నాయి. మేడ్చల్ పెద్ద చెరువు, రావల్ కోల్ పెద్ద చెరువు, డబీల్‌పూర్ చెరువు డబీల్‌పూర్ చెరువులు అలుగులు పోస్తున్నాయి. అత్వెల్లి, రాయిలాపూర్, ఎల్లంపేట్, రాజబొల్లారం, పూడూర్ తదితర గ్రామాల చెరువులు నీటితో సమృద్ధిగా నిండాయి.


చేపలు పడుతూ.. సందడిగా గడుపుతూ.!

కొత్త నీరుకు చేపలు ఎదురొస్తుండటంతో మత్స్యకారులు, యువకులు చేపలు పడుతూ కనిపించారు. దీంతో చెరువు, అలుగు పరిసరాలు సందడిగా మారాయి. అధికారులు చెరువుల వద్దకు వెళ్లి పరిస్థితిని సమీక్షిస్తున్నారు. ఎలాంటి ఘటనలు చోటు చేసుకోకుండా తగిన ఏర్పాట్లు చేస్తున్నారు.



డబీల్‌పూర్ మల్క చెరువులో

అలుగు పారుతున్న మేడ్చల్ పెద్ద చెరువు



సమస్యలపై దృష్టి సారించిన అదనపు కలెక్టర్లు

- అధికారులతో విజయేందర్‌రెడ్డి సమావేశం
- విద్యార్థులతో రాధికాగుప్తా



అధికారుల సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి

సాక్షి,మేడ్చల్ జిల్లా: వచ్చే ఖరీఫ్ సీజన్ 2025–26 సంవత్సరంలో రైతుల నుంచి ధాన్యం కొనుగోలు ప్రక్రియ సజావుగా జరిగేలా అన్ని ఏర్పాట్లు ముందుగానే పూర్తి చేయాలని సంబంధిత అధికారులను జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) విజయేందర్‌రెడ్డి ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లో జిల్లా అడిషనల్ కలెక్టర్ అధ్యక్షతన 'ప్యాడి యాక్షన్ ప్లాన్'పై సమీక్ష సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. జిల్లాలో 14 ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటుతో పాటు వాటికి అవసరమైన ఖాళీ సంచుల సమీకరణ, తూకం యంత్రాలు, తేమ కొలిచే పరికరాలు, షెడ్ల ఏర్పాట్లతో పాటు రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ధాన్యం విక్రయించేలా తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

క్రమపద్ధతిలో టోకెన్ల జారీ..

మార్కెటింగ్ శాఖ అధికారులు ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద రైతులకు సరైన అవగాహన కల్పించి, క్రమపద్ధతిలో టోకెన్లు జారీ చేయాలన్నారు. సివిల్ సప్లై అధికారులు, మిల్లర్లతో సమన్వయం చేస్తూ.. ధాన్యం రవాణా, నిల్వలో ఎలాంటి సమస్యలు రాకుండా చూసుకోవాలని అదనపు కలెక్టర్ సూచనలు చేశారు. వ్యవసాయశాఖ అధికారులు రైతులకు ముందస్తు సూచనలిస్తూ.. తేమ శాతం 17 లోపే ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. తేమ అధికంగా ఉంటే రైతులకు నష్టాలు కలగొచ్చని, వారికి సరైన అవగాహన కల్పించాలన్నారు. పౌరసఫరాల సంస్థ జిల్లా మేనేజర్ సుగుణబాయి, సివిల్ సప్లై శాఖ అధికారి శ్రీనివాస్‌రెడ్డి, వ్యవసాయశాఖ, మార్కెటింగ్‌శాఖ, జిల్లా సహకార శాఖ ఇఅధికారులు పాల్గొన్నారు.

విద్యార్థులు వ్యక్తిగత శుభ్రతను పాటించాలి..



అంకిరెడ్డిపల్లి బీసీ వెల్ఫేర్ రెసిడెన్షియల్ విద్యార్థులతో అదనపు కలెక్టర్ రాధికాగుప్తా

కీసర: విద్యార్థులు వ్యక్తిగత పరిశుభ్రతను పాటించాలని మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా అదనపు కలెక్టర్ రాధికాగుప్తా అన్నారు. మంగళవారం కీసర మండలం అంకిరెడ్డిపల్లిలోని ఉప్పల్, కుత్బుల్లాపూర్‌లకు నిర్వహిస్తున్న మహాత్మ జ్యోతిబాపూలే తెలంగాణ బీసీ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూల్, జూనియర్ కళాశాలను ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. విద్యార్థులు వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. స్కూల్‌లో ఎలాంటి సమస్యలున్నా.. తన దృష్టికి తీసుకురావాలని ఆమె ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులకు సూచించారు. వంటగది, స్టోర్‌ను పరిశీలించి, వంట పదార్థాలపై ఎలాంటి పురుగులు, దోమలు పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని చెప్పారు. భోజనం నాణ్యతగా వండి వడ్డించాలని పేర్కొన్నారు. అనంతరం తరగతి గదుల్లో తిరుగుతూ.. విద్యార్థులతో ముచ్చటించారు. ప్రిన్సిపాల్ నాగమణి, సంబంధిత అధికారులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్నెట్, టీవీ కేబుళ్ల తొలగింపు

ఘట్‌కేసర్: 'విద్యుత్ స్తంభాలు భద్రమేనా?' కథనానికి ఘట్‌కేసర్ సబ్‌స్టేషన్ ఏఈ యశ్వంత్‌కుమార్ స్పందించారు. మున్సిపాలిటీలో విద్యుత్ స్తంభాలకు వేలాడుతున్న ఇంటర్నెట్, టీవీ కేబుళ్లను విద్యుత్ సిబ్బందితో కట్ చేయించారు. రామంతాపూర్, బండ్లగూడ, అంబర్‌పేట్‌లో విద్యుత్‌శాఖ తప్పిదం వల్ల 8 మంది మృతి చెందారని, ప్రచార మాధ్యమాల్లో రావడంతో విద్యుత్ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు స్పందించామన్నారు.



ఘట్‌కేసర్‌లో ఇంటర్నెట్ కేబుళ్లను తొలగిస్తున్న విద్యుత్ సిబ్బంది

శామీర్‌పేట్‌లో..

శామీర్‌పేట్: అనుమతి లేకుండా విద్యుత్ స్తంభాలకు ఏర్పాటు చేసిన ప్రైవేటు సంస్థలకు చెందిన కేబుల్ వైర్లను మంగళవారం విద్యుత్‌శాఖ అధికారులు తొలగించారు. ఇటీవల నగరంలోని రామంతాపూర్‌లో జరిగిన ప్రమాదం నేపథ్యంలో విద్యుత్‌శాఖ ఉన్నతాధికారులు యుద్ధప్రాతిపాదికన తొలగించాలని ఆదేశాలు జారీ చేశారు. ఈ మేరకు ఉమ్మడి శామీర్‌పేట్ మండలంలో విద్యుత్ స్తంభాలకు కుప్పలుతెప్పలుగా ఏర్పాటు చేసిన కేబుల్‌వైర్లను తొలగించారు.



శామీర్‌పేట్‌లో..

ఆపరేటర్ల నిరసన.. ప్రజలకు ఇబ్బందులు

మేడ్చల్: ఎలాంటి ముందస్తు సమాచారం ఇవ్వకుండా విద్యుత్‌స్తంభాలకు ఉన్న కేబుళ్లను తొలగించారని పట్టణ కేబుల్ ఆపరేటర్లు మంగళవారం నిరసన చేయడంతో ఇంటర్నెట్ యూజర్లు కేబుల్ టీవీ యూజర్లు ఇబ్బందులు పడ్డారు. మంగళవారం కేబుల్ ఆపరేటర్లు ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 7 గంటల వరకు టీవీ ప్రసారాలు, ఇంటర్నెట్ సేవలు నిలిపేసి నిరసన చేయడంతో ప్రధానంగా ఇంటర్నెట్ యూజర్లు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. సగం కంటే ఎక్కువగా ఇంటర్నెట్ పైనే వ్యాపారాలు, పనులు ఉండటంతో ఇబ్బందులు తప్పటం లేదు.

రైతులకు రూ. 2 లక్షల రుణమాఫీ చేయాలి



ఘట్‌కేసర్‌లో మాట్లాడుతున్న మాజీ ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి

ఘట్‌కేసర్: రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు రైతులకు రూ.2 లక్షల రుణమాఫీ చేయాలని మాజీ ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి డిమాండ్ చేశారు. పట్టణంలోని శివారెడ్డిగూడ వీరాంజనేయ ప్రసన్నాంజనేయ ఆలయ ఆవరణలో రైతు రుణమాఫీ సాధన కమిటీ అధ్యక్షుడు గౌరీశంకర్ (శంకరప్ప) ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఘట్‌కేసర్ రైతు సేవా సహకార సంఘంలో సభ్యులైన మండలంలోని అన్నదాతలకు రుణమాఫీ ఎందుకు కావడం లేదని ప్రశ్నించారు. రైతు రుణమాఫీ చేసేంత వరకు తదుపరి కార్యాచరణపై నిర్ణయం తీసుకోవడానికి ఈనెల 23న ఉదయం 10 గంటలకు ఏదులాబాద్‌లోని రైతు వేదికలో నిర్వహించ తలపెట్టిన సమావేశానికి ఘట్‌కేసర్ ఉమ్మడి మండలంలోని అన్నదాతలందరూ హాజరుకావాలని కోరారు. ఎఫ్ఎస్‌సీఎస్ డైరెక్టర్లు లక్ష్మారెడ్డి, ధర్మారెడ్డి, మాజీ ఉప సర్పంచ్‌లు మహిపాల్‌రెడ్డి, నరేష్, రైతులు బస్వరాజ్, హరినాథ్‌రెడ్డి, కోటిరెడ్డి, రవీందర్‌రెడ్డి, మధుసూదన్‌రెడ్డి, జైపాల్‌రెడ్డి, భాస్కర్‌గౌడ్, జైపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

పీఆర్‌టీయూటీఎస్ మహాధర్నాను విజయవంతం చేయాలి



పీఆర్‌టీయూటీఎస్ మహాధర్నా వాల్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న చీర యాదగిరి

కీసర: పీఆర్‌టీయూటీఎస్ ఆధ్వర్యంలో సెప్టెంబర్ 1వ తేదీన నిర్వహించే మహాధర్నా కార్యక్రమానికి ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు హాజరై విజయవంతం చేయాలని కీసర మండల అధ్యక్షులు చీర యాదగిరి అన్నారు. పీఆర్‌టీయూటీఎస్ రాష్ట్ర శాఖ పిలుపు మేరకు మంగళవారం మధ్యాహ్న భోజన విరామ సమయంలో చీర్యాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులు రవీందర్ చేతుల మీదుగా మహాధర్నా వాల్‌పోస్టర్ ఆవిష్కరించారు. గత అసెంబ్లీ ఎన్నికలకు ముందు కాంగ్రెస్ పార్టీ తమ ఎన్నికల మేనిఫెస్టోలో సీపీఎస్‌ను రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరిస్తామని హామీ ఇచ్చి మర్చిపోయిందని అన్నారు. ఈ విషయాన్ని గుర్తు చేస్తూ ఇచ్చిన హామీని నిలబెట్టుకుని ఉద్యోగ ఉపాధ్యాయులందరికి న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో పీఆర్‌టీయూటీఎస్ కీసర మండల ప్రధాన కార్యదర్శి ఈగ శ్రీనివాస్, వేదవతి, తిరుమలరెడ్డి, శ్రీనివాసులు, శ్రీనివాస్, రవీందర్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, జనార్దన్, శ్రీనివాస్, వెంకటరమణారెడ్డి, విజయశ్రీ, శశిరేఖ, నాయకులు నర్సింహారెడ్డి, రామచంద్రయ్య, రాజ్యలక్ష్మి, అరవింద్, గోపాల్, అవినాష్, లింగం, ఇందిరా పాల్గొన్నారు.

హైవేపై ట్రాఫిక్‌కు అంతరాయం !



మేడ్చల్ పట్టణంలో జాతీయ రహదారిపై నిలిచిపోయిన వాహనాలు

మేడ్చల్: పట్టణంలో నుంచి వెళ్తున్న 44వ జాతీయ రహదారి విస్తరణ పనులు సాగుతుండటం, సరైన ప్రత్యామ్నాయ ఏర్పాట్లు లేకపోవడంతో నిత్యం రహదారిపై ట్రాఫిక్‌కు అంతరాయం కలుగుతోంది. ప్రధానంగా ఉదయం, సాయంత్రం స్కూల్స్, కళాశాలలు, ఉద్యోగుల సమయాల్లో ట్రాఫిక్‌జామ్ అవుతుండటంతో వాహనదారులు తమ గమ్యస్థానాలకు వెళ్లేందుకు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. ఓ వైపు రోడ్డు విస్తరణ పనులు, మరో వైపు వర్షాలతో వరద నీరు రోడ్లపై ప్రవహిస్తుండటం, పట్టణంలో ప్రత్యామ్నాయ రోడ్లు అభివృద్ధి చేయకపోవడంతో హైవేపై వర్షంతో కంకర తేలి గుంతలమయంగా రోడ్డు మారడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నిత్యం ఇదే పరిస్థితి కొనసాగుతోందని వాహనదారులు వాపోతున్నారు. ట్రాఫిక్ పోలీసులు తీవ్రంగా శ్రమిస్తున్నా.. సమస్య నివారణకు తగిన ఏర్పాట్లు చేయకపోవడంతో ట్రాఫిక్ కష్టాలు తప్పడం లేదు. ట్రాఫిక్ నివారణకు తగిన చర్యలు తీసుకోవాలని వాహనదారులు కోరుతున్నారు.

అంబులెన్స్‌లో ఆకస్మిక తనిఖీ



కీసర ప్రభుత్వ ఆసుపత్రిలో తనిఖీ చేస్తున్న జిల్లా డిప్యూటీ డీఎంహెచ్‌వో డా.సత్యవతి

కీసర: తెలంగాణ ప్రభుత్వ కమిషనర్ ఆఫ్ ఫ్యామిలీ వెల్ఫేర్ ఆదేశానుసారం కీసర ప్రభుత్వ ఆసుపత్రిలోని 108 అంబులెన్స్ వాహనాన్ని మంగళవారం జిల్లా డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ సత్యవతి ఆకస్మికంగా తనిఖీ చేశారు. వాహన పనితీరు, వాహనంలో వైద్య పరికరాలు ఉన్నాయా.. లేదా అని పరిశీలించారు. అత్యవసర సమయంలో ఉపయోగించే వైద్య పరికరాలు ఏఈడీ, సెక్షన్ ఆపరేటర్, మల్టిపుల్ పార మానిటర్, అంబుబ్యాగ్స్ తదితర పరికరాలు సక్రమంగా పనిచేస్తున్నాయా.. లేదా అని పరిశీలించి తెలుసుకున్నారు. వాటి పనితీరు సమర్థవంతంగానే ఉందని ఆమె తెలిపారు. కీసర ప్రభుత్వ ఆసుపత్రి డాక్టర్ మనుజరెడ్డి, జిల్లా 108 ప్రోగ్రామ్ మేనేజర్ భూమానాగేందర్, జిల్లా 108 కో–ఆర్డినేటర్ తిరుపతి, 108 సిబ్బంది, ఈఎంటీ రవి, పైలట్ రాంబాబు సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం



కీసర: మండల శ్రీరామలింగేశ్వర ఫొటో, వీడియోగ్రఫీ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా కీసర అమరవీరుల స్థూపం వద్ద ఫొటోగ్రఫీ సృష్టికర్త లూయిస్ జక్వాస్ మండే డాగ్యురే చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ప్రభుత్వ పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రం, పారిశుద్ధ్య కార్మికులకు బిస్కెట్లు, పండ్లు పంపిణీ చేశారు. అసోసియేషన్ అధ్యక్షుడు పొన్నం నర్సింగ్‌రావు, గౌరవ అధ్యక్షుడు శ్రీనివాస్, మధుసూదన్, సలహాదారులు శేఖర్, రాజు, మహేష్, సంయుక్త కార్యదర్శి నరేష్, కిరణ్, అఫ్జల్ పాషా, కిషోర్, లక్ష్మణ్, సాయి, ప్రవీణ్, ప్రసాద్, కృష్ణ, బలరాజు, రమేష్, రాజు తదితరులున్నారు.

అపజయాలను పాఠాలుగా భావించాలి



విద్యార్థులకు పట్టాలను అందజేస్తున్న చైర్మన్ నర్సింహారెడ్డి

మేడ్చల్‌రూరల్: అపజయాలను పాఠాలుగా భావించి, పట్టుదలతో ముందడుగు వేయాలని మైండ్ బీన్స్ వ్యవస్థాపకుడు వెల్నెస్ మెంటార్, లైఫ్ కోచ్ ఆదిరాజు రఘురాం అన్నారు. మైసమ్మగూడలోని నర్సింహారెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో మంగళవారం స్నాతకోత్సవం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ప్రపంచం వేగంగా మార్పు చెందుతుందన్నారు. పట్టభద్రులైన విద్యార్థులు జీవితంలో అవకాశాలను అందిపుచ్చుకోవాలంటే నైపుణ్యాలు అవసరమని అన్నారు. ఏ స్థితిలో కూడా నైతికతను వినియోగించుకుని ఉత్తమ పౌరులుగా ఉండాలన్నారు. ప్రముఖ సైకాలజిస్టు అన్నంరెడ్డి చాముండేశ్వరీ, క్రియేటర్స్ ఎండీ చింతకాయల ఆశీష్ మాట్లాడుతూ.. విద్యా ప్రయాణం ఇక్కడితో ఆగొద్దని ఉన్నత చదువులపై దృష్టి సారించాలని సూచించారు. భవిష్యత్ ఇంజినీర్లుగా సమాజ ప్రగతిలో భాగస్వాములు కావాలన్నారు. అనంతరం ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులకు పట్టాలు, పతకాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల చైర్మన్ నర్సింహారెడ్డి, కార్యదర్శి త్రిశూల్‌రెడ్డి, కోశాధికారి త్రిలోక్‌రెడ్డి, ప్రిన్సిపాల్ లోకనాథం, డైరెక్టర్ మోహన్, హెచ్‌ఓడీలు, అధ్యాపకులు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

వేతనాలు సకాలంలో చెల్లించాలని..

నిరసన చేపట్టిన ఆశావర్కర్లు



జవహర్‌నగర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద..

జవహర్‌నగర్: ఆశావర్కర్లకు సకాలంలో వేతనాలు అందించాలని మంగళవారం జవహర్‌నగర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ముందు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆశావర్కర్లు మాట్లాడుతూ.. ఆశావర్కర్లకు కాంగ్రెస్ ప్రభుత్వం మేనిఫెస్టో ప్రకారం వేతనాలు పెంచాలని, సకాలంలో జీతాలు చెల్లించి సమస్యలను పరిష్కరించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

జూలై పారితోషకాలు చెల్లించలేదు..

మేడ్చల్: ప్రతి నెల 30 లోగా అశావర్కర్లకు ఇచ్చే పారితోషకాలు అగస్టు పూర్తి కావొస్తున్నా.. జూలైలో ఇంతవరకు ఇవ్వలేదని మండల ఆశావర్కర్లు వాపోయారు. ఈ మేరకు మంగళవారం శ్రీరంగవరం మెడికల్ ఆఫీసర్‌కు తమ పారితోషకాలు ఇవ్వకపోతే ధర్నా చేస్తామని హెచ్చరించారు. ఈ మేరకు ఆయనకు వినతిపత్రం అందజేశారు. ప్రభుత్వం ఆశావర్కర్లకు పారితోషకాలను 30 లోగా ఇస్తుందని, జూలై పారితోషకాలు ఇంత వరకు ఇవ్వలేదన్నారు. పారితోషకాలు లేకపోవడంతో తాము ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని, వెంటనే నిధులు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ విషయంపై ఈనెల 25న కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహిస్తామని, సెప్టెంబర్ 1న చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వం తమ డిమాండ్లను వెంటనే నెరవేర్చాలని డిమాండ్ చేశారు. ఆశావర్కర్లు వసంత, పద్మ, రాజమణి, యాదమ్మ, రేణుక, శ్రీదేవి, లక్ష్మీబాయి, అసియా తదితరులు పాల్గొన్నారు.



మెడికల్ ఆఫీసర్‌కు ధర్నా పత్రాన్ని అందజేస్తున్న ఆశావర్కర్లు